నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, బుధవారం 26 ఫిబ్రవరి 2025 | KHAMMAM

మార్చి 31లోగా ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి

రెవెన్యూ పరిధిలోని దరఖాస్తుల స్క్రూట్నీకి ప్రత్యేక బృందాలు

ఎల్ ఆర్ఎస్‌పై సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, ఫిబ్రవరి 25: ఎల్ఆర్ఎస్ కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను మార్చి 31వ తేదీలోగా పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్‌పై నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్, సుడా, కార్పొరేషన్ అధికారులు సమన్వయంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ప్రాసెస్ చేసి పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారుల వద్ద ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని, మార్చి 31వ తేదీలోగా వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, కోర్టు కేసులు, నీటివనరుల బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో లేకుండా క్లియర్‌గా ఉన్న భూముల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఆమోదించాలన్నారు. రెవెన్యూ శాఖ పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్క్రూట్నీకి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు ఆయా శాఖల సిబ్బందికి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్క్రూట్నీ కోసం ప్రతిరోజూ లక్ష్యాలను నిర్దేశించాలన్నారు. నీటిపారుదల శాఖ పరిధిలో తనిఖీల సమయంలో ఎట్టి పరిస్థితుల్లో నీటివనరుల బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లో ఉండవద్దన్నారు. పట్టణంలో నాలాల ఆక్రమణ కాకుండా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలించాలని, లే అవుట్ క్రమబద్ధీకరణ సమయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అప్రోచ్ రోడ్, ప్లాట్ల మధ్య రోడ్డు సరిగా ఉండేలా చూడాలన్నారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసిందని, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో దరఖాస్తులను ఫాస్ట్ ట్రాక్ చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో నర్సింహారావు, ఆర్ఐలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అతడి పేరు భూక్యా హరికృష్ణ. ఇంటర్ విద్యార్థి. అతడి తండ్రి చిన్నపాటి రైతు. పేద కుటుంబం. పంట చేతికొస్తేనే కుటుంబం గడిచే పరిస్థితి. అతడిది చండ్రుగొండ మండలం రావికంపాడు. ఆ గ్రామంలోనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకూ చదువుకున్నాడు. ఇంటర్ చదువుకుందామంటే అతడి మండలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేదు. దీంతో పొరుగునే ఉన్న జూలూరుపాడు మండలంలోని ఒక ప్రైవేటు జూనియర్ కాలేజీలో చేరాడు. కానీ పబ్లిక్ పరీక్షలు సమీపించే సరికి అసలు సమస్య ఎదురైంది. అదేంటంటే జూలూరుపాడులో ఇంటర్ పరీక్ష కేంద్రం లేకపోవడం. దీంతో అతడు పరీక్షలు రాయాలంటే 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రమైన కొత్తగూడెం వెళ్లాల్సిందే. అదీగాక.. జూలూరుపాడు, చండ్రుగొండ మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రమైన కొత్తగూడేనికి నేరుగా బస్సులు ఉన్నప్పటికీ.. ఆయా విద్యార్థులు తమ పల్లెల నుంచి ఆటోల్లో ప్రయాణించి మండల కేంద్రాలకు చేరుకొని, అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి చేరుకోవాల్సిన పరిస్థితి. అంతేకాదు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలు లేని మండలాలు జూలూరుపాడు, చండ్రుగొండ మాత్రమే కాదు. భద్రాద్రి జిల్లాలో ఇలాంటి మండలాలు ఏకంగా ఏడు ఉండడం గమనార్హం. ఈ అన్ని మండలాల్లోనూ ఇంటర్ విద్యార్థులది ఇదే పరిస్థితి.

-భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ)

పరీక్ష రాయాలంటే.. ఆటో ఎక్కాల్సిందే

- 30 కిలోమీటర్ల దూరంలో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలు
- సమయానికి చేరుకునేందుకు విద్యార్థులకు తప్పని అవస్థలు
- మొదట స్వగ్రామాల నుంచి మండల కేంద్రాలకు ప్రయాణం
- ఆ తరువాత అక్కడి నుంచి పరీక్షా కేంద్రాలకు పరుగులు
- ఈ మధ్యలో ఎక్కడ ఆటో అందకున్నా పరీక్ష మిస్సయ్యే ప్రమాదం
- కేవలం మండల కేంద్రాల నుంచే ఎగ్జామ్ సెంటర్లకు ఆర్టీసీ బస్సులు
- కానీ గ్రామాల నుంచి చేరుకునే విద్యార్థులకు తప్పని తిప్పలు
- భద్రాద్రి జిల్లాలో ఏడు మండలాల్లో సర్కారు కళాశాలే లేవు

మార్చి 5 నుంచి 22 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగనున్నాయి. భద్రాద్రి జిల్లాలో 19,258 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. వీరి కోసం అధికారులు 36 పరీక్ష కేంద్రాను ఏర్పాటు చేశారు. అయితే, జిల్లాలో 23 మండలాలు ఉండగా.. వాటిల్లో ఏకంగా ఏడు మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు లేవు. అయితే, ఇంటర్ చదువుకునేందుకే రోజూ పదుల కిలోమీటర్ల మేర ప్రైవేటు వాహనాల్లో రాకపోకలు సాగిస్తూ తరగతులకు హాజరవుతున్న పరిస్థితుల్లో అసలు వార్షిక పరీక్షలు రాసేందుకు కూడా ఇంకొంత దూరం ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తున్నది. ఈ దూరం ఒక్కో గ్రామం నుంచి 20–30 కిలోమీటర్ల వరకూ ఉంటోంది. పైగా, పరీక్ష సమయానికంటే ముందుగానే ఎగ్జామ్ సెంటర్‌కు చేరుకోవాలన్న తొందరలో అత్యధికంగా ఆటో చార్జీలు చెల్లించుకోవాల్సి వస్తున్నది. దీంతోపాటు ఇంటర్ పరీక్షా కేంద్రాలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలు లేని మండలాల వివరాల ఇలా ఉన్నాయి. అవి, ఆళ్లపల్లి, కరకగూడెం, దమ్మపేట, సుజాతనగర్, చండ్రగొండ, జూలూరుపాడు, లక్ష్మీదేవిపల్లి.

మండలం..	పరీక్షా కేంద్రానికి దూరం
ఆళ్లపల్లి	30 కిలోమీటర్లు
జూలూరుపాడు	25
చండ్రుగొండ	20
కరకగూడెం	15
దమ్మపేట	12
సుజాతనగర్	13

మండల కేంద్రం నుంచి పరీక్ష కేంద్రానికి ఎంత దూరమంటే..

ఇంటర్ విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యాన్ని కల్పించారు. కానీ అవి మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు, లేదా పరీక్ష కేంద్రాల వరకు మాత్రమే ఉంటున్నాయి. కానీ ఆయా విద్యార్థులు తమ పల్లెల నుంచి మండల కేంద్రాల్లోనే అధిక చార్జీలిచ్చి మరీ ఆటోల్లోనే ప్రయాణించాల్సిన పరిస్థితి. మండల కేంద్రాల నుంచి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలంటే ప్రయాణించాల్సిన దూరం వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

మా మండలంలో ప్రభుత్వ కాలేజీ లేదు..

మా మండలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేకపోవడంతో ప్రైవేటు కాలేజీలో చదువుతున్నాను. ఇక్కడ పరీక్ష కేంద్రం కూడా లేదు. కొత్తగూడెం వెళ్లి పరీక్ష రాయాలి. మా ఊరి నుంచి ఆటోలో జూలూరుపాడు వెళ్లాలి. అక్కడి నుంచి బస్సు ఎక్కి కొత్తగూడెం చేరుకోవాలి. అసలే ఓవైపు పరీక్షల టెన్షన్ ఉంది. ఇప్పుడు ప్రయాణం విషయంలో మరో టెన్షన్ మొదలైంది. పరీక్ష సమయానికి చేరుకునేలా ఆటోలు, బస్సులు ఉంటాయో ఉండవో నన్న ఆందోళన వెంటాడుతోంది.

–ధరావత్ చరణ్, ఇంటర్ సెకండియర్, బేతాలపాడు, జూలూరుపాడు

రెండు గంటల ముందుగానే ఆటో ఎక్కాలి..

మా మండలంలో కూడా ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేదు. జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే మా మండల కేంద్రం నుంచి 25 కిలోమీటర్లు ప్రయాణించాలి. మా ఊరి నుంచి జిల్లా కేంద్రమైన కొత్తగూడేనికి చేరుకోవాలంటే ఆటోలు ఎక్కాల్సిందే. రెండు గంటల ముందుగా బయలుదేరితే తప్ప పరీక్ష సమయానికి చేరుకోలేని పరిస్థితి. పొరపాటున ఆటో లేట్‌నా, ఒకవేళ బస్సు అందకపోయినా పరీక్షను కోల్పోయే ప్రమాదం. పరీక్ష కేంద్రాలు దూరంగా ఉంటే ఎంతో ఇబ్బందిగా ఉంది.

–ధరావత్ వినాయక్, ఇంటర్ సెకండియర్, బాల్యాతండా, చండ్రుగొండ

30 కిలోమీటర్ల దూరంలో పరీక్ష కేంద్రం..

మాది మర్కోడు గ్రామం. ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు చదువుతున్నాను. వార్షిక పరీక్షలు రాయాలంటే గుండాల మండల కేంద్రానికి వెళ్లాల్సిందే. అది మా ఊరికి 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. అంతదూరం వెళ్లి పరీక్ష రాయాలంటే చాలా కష్టంగా ఉంటుంది. మా దగ్గర పరీక్ష కేంద్రం లేని కారణంగా ఇబ్బందులు పడుతూనే పరీక్షలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు మాలాంటి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విషమ పరీక్షలు అవుతున్నాయి.

–వేమూరి మహేంద్రకుమార్, ఒకేషనల్, మర్కోడు, ఆళ్లపల్లి

ఏడు మండలాల్లో ప్రభుత్వ కాలేజీలు లేవు..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏడు మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు లేవు. గత ఏడాది జూలూరుపాడు మండలంలో ఒక పరీక్ష కేంద్రం ఉండేది. అయితే, అక్కడ ప్రైవేటు కాలేజీకి ప్రభుత్వం నుంచి అనుమతి లభించలేదు. అందువల్ల అక్కడి పరీక్ష కేంద్రం క్యాన్సిల్ అయింది. కొన్ని మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు లేనందువల్లనే పరీక్ష కేంద్రాలు పెట్టడం లేదు. దూర ప్రాంతాల విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నాం.

–హెచ్.వెంకటేశ్వరరావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, భద్రాద్రి

మహాశివరాత్రికి.. వైభవంగా ఏర్పాట్లు

- శివపార్వతుల కల్యాణానికి సిద్ధమైన శైవక్షేత్రాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెలుగులీనుతున్న ఆలయాలు



కూసుమంచిలో ముస్తాబైన కాకతీయులనాటి శివాలయ గర్భగుడి

మహాశివరాత్రి పర్వదినం కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ ముస్తాబయ్యాయి. ప్రముఖ ఆలయాల్లో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా జరిపించేందుకు ఆలయ కమిటీల బాధ్యులు, దేవాదాయ శాఖ అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. అభిషేక ప్రియుడైన మహాశివుడికి వందలాది లీటర్ల పాలు, పెరుగు, పంచామృతాలతో అభిషేకాలు, మహా రుద్రాభిషేకాలు చేయనున్నారు. బుధవారం తెల్లవారు జామున 5 గంటల నుంచే భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పిస్తారు. అన్ని ఆలయాల్లోనూ బుధ వారం రాత్రికి శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తారు. కాకతీయుల శివభక్తికి తార్కాణంగా నిలిచిన కూసుమంచి శివాలయం, ఖమ్మం రూరల్ తీర్థాల సంగమేశ్వరాలయం, వైరా స్నానాల లక్ష్మీపురం శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం, బూర్గంపహాడ్ మోతె వీరభద్రస్వామి ఆలయం, చర్ల శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, శ్రీభద్రకాళీ వీరభద్రస్వామి ఆలయం, చుంచుపల్లి శివాలయం, పాల్వంచ అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, జూలూరుపాడు పాపకొల్లు శ్రీఉమా సోమలింగేశ్వర స్వామి ఆలయం తదితర ఆలయాల్లో మహాశిరాత్రి వేడుకలను, శివపార్వతుల కల్యాణ ఘటాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

–నమస్తే తెలంగాణ నెట్‌వర్క్

నాలుగు రోజుల్లో సాగర్ నీరు

- జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య
- నారాయణపురంలో వడలిపోతున్న మొక్కజొన్న పంటల పరిశీలన

మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డీఏవో పుల్లయ్య

బోనకల్లు, ఫిబ్రవరి 25: సాగర్ ఆయకట్టు భూములకు మూడు నాలుగు రోజుల్లో నీరందేలా చూస్తామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య అన్నారు. నారాయణపురంలో సాగర్ కెనాల్ కింద వడలిపోతున్న మొక్కజొన్న పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. సాగునీటి గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. నారాయణపురం మైనర్ కాల్వ చివరి భూములకు సాగునీరు అందడం లేదని, పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసినట్లైతే పంటకు నష్టం జరిగే అవకాశం ఉండదని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. వారబందీ విధానంలో నీటిని విడుదల చేస్తూ రెండు రోజులు అదనంగా నీటిని సరఫరా చేస్తే బాగుంటుందని కోరారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ పంట ఎక్కడైనా వడలినట్లు కనిపిస్తే 2 శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో అర్హులైన రైతులు ఫిజికల్ వెరిఫికేషన్ సకాలంలో పూర్తి చేయాలని వ్యవసాయ విస్తరణాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మధిర డివిజన్ సహాయ సంచాలకులు స్వర్ణ విజయచంద్ర, బోనకల్లు నీటిపారుదల శాఖ డీఈఈ తమ్మారపు వెంకటేశ్వర్లు, నీటిపారుదల శాఖ ఏఈఈ ఏడుకొండలు, వ్యవసాయ విస్తరణాధికారులు షేక్ హుస్సేన్ సాహెబ్, నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

రూ.90 లక్షల విలువైన గంజాయి పట్టివేత

8 బస్తాల్లో తరలిస్తున్న ఆరుగురు నిందితుల అరెస్టు

పట్టుబడిన గంజాయితో డీసీపీ ప్రసాదరావు, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ సంజీవ్

కూసుమంచి, ఫిబ్రవరి 25 : ఒడిశా నుంచి పూణేకు గంజాయిని బస్తాల్లో తరలిస్తున్న ఆరుగురిని పోలీసులు మంగళవారం పట్టుకొని అరెస్టు చేశారు. డీసీపీ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి పర్యవేక్షణలో సీఐ సంజీవ్, ఎస్సై నాగరాజు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని ఖమ్మం మీదుగా మరిపెడ బంగ్లా నుంచి పూణేకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఎస్సై నాగరాజు చేగొమ్మ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టగా.. మహేంద్రా ఎక్స్ యూవీ కారు అనుమానాస్పద స్థితిలో కనిపించింది. వెంటనే ఆపి తనిఖీ చేయగా.. అందులో ఇద్దరు వ్యక్తులతోపాటు 8 బస్తాల్లో గంజాయి బయటపడింది. పల్లపు రఘు, మహ్మద్ ఖాజాపాషా ఒడిశాలోని బాబు, సుబ్బరాజు, రామాంజనేయులు వద్ద తక్కువ రేటుకు గంజాయిని కొనుగోలు చేసి పూణేలోని సోహైల్ అనే వ్యక్తి ఎక్కువ ధరకు అమ్ముకొని వ్యాపారం చేస్తున్నట్లు విచారణలో తేలింది. రూ.89,43,870 విలువ గల 178.870 కేజీల గంజాయి, మహీంద్రా ఎక్స్ యూవీ వాహనం, 41 గ్రాముల బంగారం, రూ.9 వేల నగదు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరుకు చెందిన పల్లపు రఘు హైదరాబాద్‌లో ట్రావెల్స్ నడుపుతూ తన కారులోనే గంజాయిని తరలించాడు. మొత్తం ఆరుగురు వ్యక్తులు పల్లపు రఘు, మహ్మద్ ఖాజా పాషా, ఒడిశాకు చెందిన బాబు, సుబ్బరాజు, పూణేకు చెందిన రామాంజనేయులు, సోహైల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీధరాచారి పోలీసులు పాల్గొన్నారు.

'పది'తోనే భవిష్యత్‌కు మలుపు

- భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్
- ఉల్వనూరు, కిన్నెరసాని ఆశ్రమ పాఠశాలల సందర్శన

ఉల్వనూరు ఆశ్రమ పాఠశాలలో బాలికలకు సూచనలిస్తున్న పీవో రాహుల్

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 25: పదో తరగతి వార్షిక పరీక్షల్లో సాధించిన మార్కులతోనే భవిష్యత్‌కు మంచి మలుపు అవుతుందని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. ఉల్వనూరు బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టపడి చదివి మంచి మార్కులతో పాసైతేనే కష్టానికి తగిన ఫలితం లభించినట్లు అవుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ కష్టపడి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారని, వారి శ్రమను అర్థం చేసుకుని ఉత్తీర్ణత సాధించి వారికి మంచిపేరు తేవాలని కోరారు. క్రమశిక్షణ, ప్రత్యేక శ్రద్ధతో చదువుకొని 10/10 ర్యాంకు సాధించాలని ఆకాంక్షించారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం కిన్నెరసానిలోని ఆశ్రమ బాలుర పాఠశాలలో వేదిక్ మ్యాథ్స్ తరగతి గదిని పీవో సందర్శించారు. ఉపాధ్యాయురాలు బోధిస్తున్న తీరును విద్యార్థుల మధ్య కూర్చొని విన్నారు. గణితం పట్ల భయాన్ని పోగొట్టేందుకు వేదిక్ మ్యాథ్స్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అనంతరం సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించి అవసరమైన మెటీరియల్ కొరకు తనను సంప్రదించాలన్నారు.కార్యక్రమంలో దమ్మపేట ఏటీడీవో చంద్రమోహన్, ఉల్వనూరు హెచ్ఎం విజయలక్ష్మి, కిన్నెరసాని హెచ్ఎం రామారావు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రశ్నాపత్రాలొచ్చాయ్..

- పోలీసు బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌కు..
- జూనియర్ కళాశాలల లాగిన్‌లో హాల్ టికెట్లు
- తప్పలుంటే ఈ నెల 28లోగా సరిచేసేందుకు అవకాశం

ఖమ్మంలోని నయాబజార్ జూనియర్ కళాశాల

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 25: పోలీసు బందోబస్తు మధ్య ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ప్రశ్నాపత్రాలు జిల్లాకు చేరాయి. ఇంటర్ విద్యాధికారి కె.రవిబాబు ఆధ్వర్యంలో జనరల్–2, ఒకేషనల్–1 సెట్స్‌ను నయాబజార్ జూనియర్ కళాశాల కేంద్రంగా ఉన్న స్ట్రాంగ్ రూమ్‌కు బోర్డు అధికారులు మంగళవారం చేర్చారు. అయితే స్ట్రాంగ్ రూమ్ వద్ద 24 గంటల బందోబస్తు కల్పించాలని డీఐఈవో పోలీస్ కమిషనర్ సునిల్‌దత్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో పోలీస్ సిబ్బంది ఆయుధాలతో పహారా కాస్తున్నారు. కళాశాల పరిసరాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్నప్పటికి పోలీసు సిబ్బంది కళాశాలకు సంబంధించిన వారిని కాకుండా ఇతరులను ఆ చుట్టుపక్కలకు అనుమతించడం లేదు.

కళాశాలల లాగిన్‌లో హాల్ టికెట్లు

ఇంటర్ బోర్డు పరీక్షల విభాగం అధికారులు జూనియర్ కళాశాలల లాగిన్‌లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో పాటు ఒకేషనల్‌కి సంబంధించిన హాల్ టికెట్లను పొందుపర్చారు. కొన్ని కళాశాలలు మినహా అత్యధిక కళాశాలలు మంగళవారం కావడంతో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేయలేదు. కొన్ని ప్రభుత్వ కళాశాలల్లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు ఏయే సెంటర్లు వచ్చాయో పరిశీలించారు.

తప్పలుంటే తెలియపర్చాలి..

కళాశాలల లాగిన్‌లో అందుబాటులో ఉంచిన ఇంటర్ పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లలో ఏమైనా తప్పులు ఉంటే వెంటనే తమ కార్యాలయంలో తెలియపర్చాలని డీఐఈవో రవిబాబు తెలిపారు. మార్చి 5వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ నెల 28వ తేదీలోగా తప్పులను గుర్తించి వెంటనే తెలియపరిస్తే మార్పులు చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అన్ని యాజమాన్యాల పరిధిలోని ప్రిన్సిపాళ్లు విద్యార్థుల వివరాలు మరోసారి పరిశీలించుకోవాలని ఆయన సూచించారు.

28న సీఎస్, డీవోల సమావేశం

ఇంటర్ పరీక్షలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ల సమావేశం ఈ నెల 28న నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అమలు చేయాల్సిన నిబంధనల గురించి వివరించనున్నారు. కళాశాలల్లోని అధ్యాపకులతోపాటు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయుల వివరాలు తీసుకుని.. వారికి విధులు ఎక్కడ కేటాయించాలనే దానిపై ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా పకడ్బందీగా ప్రక్రియ చేపట్టనున్నారు. సీఎస్, డీవోల సమావేశం అనంతరం ఇన్విజిలేషన్ విధులపై పూర్తి స్పష్టత రానున్నది.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

జిల్లాలో 4,089 మంది ఓటర్లు, 24 పోలింగ్ కేంద్రాలు

ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, ఫిబ్రవరి 25 : జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 27వ తేదీన పోలింగ్ కోసం జిల్లాలో 24 కేంద్రాలను సిద్ధం చేశామని, మొత్తం 4,089 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు 9 మంది సెక్టార్ అధికారులు, 28 మంది ప్రిసైడింగ్ అధికారులు, 27 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 58 మంది ఇతర పోలింగ్ సిబ్బంది, 28 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు పేర్కొన్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటు చేశామని, బుధవారం ఇక్కడి నుంచి ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రితోపాటు కేంద్రాలకు వెళ్తారని, పోలింగ్ ముగిసిన తర్వాత నేరుగా నల్లగొండలోని రిసెప్షన్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు చేరుకుంటాయని తెలిపారు. మొత్తం 8 రూట్లలో పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, సామగ్రిని తరలిస్తున్నామని, ఇందు కోసం 8 ఆర్టీసీ బస్సులను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, ప్రతి ఓటరు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.